క్లుప్తంగా...

29న మండలంలో మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్‌: మేడ్చల్‌ మండలంలో ఈ నెల 29న మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు ఆమె వివరించారు.

30న మండల సర్వసభ్యసమావేశం

మేడ్చల్‌: ఈనెల 30న మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్‌ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి అధికారులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కౌన్సిలర్‌ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఘట్‌కేసర్‌ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. నిమ్స్‌ క్లినిక్‌ వద్ద చేపట్టిన ఈ శిబిరాన్ని టౌన్‌షిప్‌ ప్లాట్స్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు, స్థానిక కౌన్సిలర్‌ బి.హరిప్రసాదరావు ప్రారంభించి, రక్తదానం చేశారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి సహకరించిన అసోసియేషన్‌ ప్రతినిధులకు, టౌన్‌షిప్‌ వాసులకు ఆసుపత్రి వైద్యులు అభినందలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉప సర్పంచ్‌ లింగేశ్వర్‌రావు తదితరులు

ఘట్‌కేసర్‌: ఏదులాబాద్‌లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్‌ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన కాళిదాసు, చరణ్‌, బాలుగౌడ్‌, శ్రీహరి కుటుంబ సభ్యులను శనివారం ఉప సర్పంచ్‌ లింగేశ్వర్‌ రావు, టీఆర్‌ఎస్‌ స్థానిక శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్‌, చిరంజీవి పరామర్శించారు. ట్రస్ట్‌ తరఫున బాధిత కుటుంబాలకు రూ. 5వేల చొప్పున రూ. 20 వేలు అందజేశారు. కార్యక్రమంలో మహేశ్‌ముదిరాజ్‌, సురేశ్‌, నరసింహా, బాలకృష్ణ, అరవింద్‌రెడ్డి, ట్రస్ట్‌ ప్రతినిధి వేణు పాల్గొన్నారు.

యోగా డే కౌంట్‌ డౌన్‌లో పాల్గొన్న బీజేపీ నేతలు



మేడ్చల్‌: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్‌ 21న నిర్వహించనున్న యోగా డే సందర్భంగా నగరంలో శనివారం నిర్వహించిన యోగా డే కౌంట్‌డౌన్‌లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి , జగన్‌గౌడ్‌, ప్రేందాస్‌, శంశీ విజయ్‌ ,శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

ఉప్పల్‌: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌ భరత్‌నగర్‌కు చెందిన తాప మహేందర్‌ భారతి(30) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భారతి శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని గాంధీ అసుపత్రికి తరలించారు. భారతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిరసనలు..నిలదీతలు

- దశాబ్ది ఉత్సవాల సమావేశం రసాభాస
- ధాన్యం కొనుగోళ్లు, స్థానిక సంస్థలకు నిధులపై ఆగ్రహం
- మంత్రి మల్లారెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపీ ప్రతినిధులు
- ఎంపీటీసీ శోభను లాక్కెళ్లిన బీఆర్‌ఎస్‌ నేతలు
- పోలీసుల ప్రేక్షక పాత్ర. పట్టించుకోని అధికారులు



సమావేశంలో ఆందోళన చేస్తున్న బీజేపీ ప్రజా ప్రతినిధులు

సాక్షి,మేడ్చల్‌ జిల్లా : కలెక్టరేట్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో మంత్రి మల్లారెడ్డి అధ్వర్యంలో శనివారం దశాబ్ది ఉత్సవాల ను విజయవంతం చేసేందుకు నిర్వహించిన సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. దశాబ్ధి ఉత్సవాల నిర్వహణపై మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ జూన్‌ 12 నిర్వహించనున్న తెలంగాణ రన్‌ కార్యక్రమంలో సినీ తారలను భాగస్వామ్యం చేస్తామని చెబుతుండగానే బీజేపీ ప్రజాప్రతినిధులు లేచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలని, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ వాగ్వాదానికి దిగారు. ప్రజలు బాధల్లో ఉంటే..దశాబ్ది ఉత్సవాలెందుకని, దీనిపై మంత్రి సమాధానం చెప్పాలని నిలదీశారు. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకునేందుకు వారు యతి ్నంచారు. గ్రామాలు, పట్టణాల్లో నిధులు లేక అభివృద్ధి పడకేసిందని వేడుకల పేరుతో డబ్బులు ఖర్చు చేయడం దారుణమని ఘట్కేసర్‌ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎంటీటీసీలు శోభ, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్‌ మహేష్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీజేపీ ,బీఆర్‌ఎస్‌ ప్రజా ప్రతినిధుల వాగ్వాదాలతో గందరగోళం నెలకొంది. వారిని అదుపు చేసేందుకు పలువురు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో బీజేపీ ప్రతినిధులను పోలీసులు బలవంతంగా హాల్‌ నుంచి బయటికి తీసుకెళ్లగా, ప్రధాన ద్వారం వద్ద వారు బైఠాయించారు. బీజేపీ ఎంపీటీసి శోభ ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలని కోరుతుండగానే ...మంత్రి సైగలతో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మేయర్లు ఆమెను బలవంతంగా హాల్‌లో నుంచి బయటికి లాక్కెళ్లారు. మంత్రి ,జిల్లా కలెక్టర్‌ సభలో ఉండగానే ఎంపీటీసీని ఈడ్చుకెళ్లిన తీరుపై బీజేపీ ప్రజానిధులు నిరసన వ్యక్తం చేశారు. సభను బహిష్కరించి ప్రధాన ద్వారం వద్ద అందోళనకు దిగారు.

బీఆర్‌ఎస్‌ నేతల వైఖరి అనైతికం: ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్కేసర్‌ మండలంలోని పలు గ్రామాల్లో 20 రోజులుగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవటంతో కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని ఘట్కేసర్‌ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సభలో మంత్రి, కలెక్టర్‌ ,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా, బీజేపీ ప్రజానిధులపై బీఆర్‌ఎస్‌ మండల నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించటం దారుణమన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధుల సమావేశంలో సభ్యులు కాని వారు ముఖ్యంగా బీఆర్‌ఎస్‌ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. గ్రామాల అభివృద్ధికి నిధులివ్వని ప్రభుత్వం, దశాబ్ధి ఉత్సవాలకు రూ.కోట్లు ఖర్చు చేయటం దారుణమని భాగారం ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి అన్నారు. తమపై బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు దాడికి యత్నించినా ,పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని, అధికార యంత్రాంగం పట్టించుకోలేదని ఆరోపించారు. రైతులు, ప్రజల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళుతుండగా, బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు ఈడ్చుకెళ్లడం పై బీజేపీ ఎంపీటీసీ శోభ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎంపీటీసీ శోభను లాక్కెళుతున్న దృశ్యం

ప్రతిష్టాత్మకంగా దశాబ్ది ఉత్సవాలు

- సన్నాహక సమావేశంలో మంత్రి మల్లారెడ్డి
- హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్‌



సాక్షి,మేడ్చల్‌ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మేడ్చల్‌ జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. 21 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్ల చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో కలెక్టర్‌ అమయ్‌ కుమార్‌, జెడ్పీ చైర్మన్‌ మలిపెద్ది శరత్‌ చంద్రారెడ్డి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌, ఉప్పల్‌ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కె.పి.వివేకానందగౌడ్‌,భేతి సుభాష్‌రెడ్డితో కలిసి దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పదేళ్లలోకి అడుగుపెడుతున్న శుభతరుణంలో ఈ ఉత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జూన్‌ 2 నుంచి 21 రోజుల పాటు వివిధ శాఖలు తమకు కేటాయించిన తేదీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇప్పటి నుంచే సన్నాహాలు చేపట్టాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు సమాయాత్తం

- దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్‌ అమయ్‌కుమార్‌ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అప్రమత్తం చేశామన్నారు. వేడుకల ప్రారంభోత్సవం రోజు నుంచి పూర్తయ్యే వరకు తానే స్వయంగా పర్యవేక్షిస్తానని కలెక్టర్‌ అమయ్‌ కుమార్‌ పేర్కొన్నారు.
- జూన్‌ 2 నుంచి 21 రోజుల వరకు నిర్వహించే తెలంగాణ దశాబ్ది వేడుకలకు సంబంధించి రోజు వారీ కార్యక్రమాలను కలెక్టర్‌ వివరించారు.
- సమావేశంలో జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ బెస్త వెంకటేష్‌, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నందారెడ్డి, డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ మధుకర్‌ రెడ్డి, మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, మేకల కావ్య, బుచ్చిరెడ్డి, చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్‌, డీఆర్‌ఓ లింగ్యానాయక్‌ ,ఆర్డీఓలు రవి, మల్లయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, మేయర్లు, చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, వైస్‌ చైర్మన్లు, మున్సిపల్‌ కమిషనర్లు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కీసర: కీసర రెవెన్యూ డివిజన్‌ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీఓ రవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18–40 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు విద్యార్హత, కులం ప్రాంతీయ ధృవీకరణ పత్రాలను గెజిటెడ్‌ అధికారిచే అటెస్టెడ్‌ చేసి జత చేసిన దరఖాస్తు పత్రాలను జూన్‌ 5లోగా ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. జూన్‌ 18న ప్రజాపంపిణీ వ్యవస్థపై నిర్వహించే రాత పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి జూన్‌ 25న ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు.

మండలాల వారీగా ఖాళీగా ఉన్న దుకాణాలు

కీసర మండలంలో కరీంగూడ, అంకిరెడ్డిపల్లి, నాగారం, దమ్మాయిగూడ(స్పోర్ట్స్‌) తిమ్మాయిపల్లి , దమ్మాయిగూడ ఎస్‌ఈబీసీ–ఏ(డబ్లు).

మేడ్చల్‌ మండలం : అత్వెల్లి, ఎల్లంపేట్‌, రావల్‌కోల్‌, ఘన్‌పూర్‌, పూడూరు–1, లింగాపూర్‌, శ్రీరంగవరం సుతారిగూడ,

ఘట్‌కేసర్‌ మండలంలో యనంపేట్‌.

నెరవేరిన సొంతింటి కల

- 665 మందిలో 80 మందికి డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు
- లాటరీ పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక



డ్రా తీస్తున్న తహసీల్దార్‌ సరిత

మేడ్చల్‌: పేదల సొంతింటి కల నెరవేరింది. ఎట్టకేలకు అధికారులు శనివారం డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను అధికారులు లాటరీ పద్ధతిన కేటాయించారు. మేడ్చల్‌ మున్సిపల్‌ కార్యాలయంలో తహసీల్దార్‌ సరిత, చైర్‌ పర్సన్‌ దీపిక నర్సింహారెడ్డి సమక్షంలో అధికారులు, కౌన్సిలర్లు డ్రా తీసి 80 మందికి డబుల్‌ ఇళ్లు కేటాయించారు. డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కోసం మున్సిపాలిటీ పరిధిలోని మేడ్చల్‌, గిర్మాపూర్‌, అత్వెల్లి వాసులు దరఖాస్తు చేసుకోగా వారిలో 665 మందిని అర్హులుగా రెవెన్యూ శాఖ గుర్తించింది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, పీడబ్ల్యూడీ, ఇతరుల వారీగా దరఖాస్తులను విభజించి రిజర్వేషన్ల ప్రాతిపదికన డ్రా తీశారు. ఎస్సీలకు 13, ఎస్టీలకు 5, మైనారిటీలకు 10, పీడబ్ల్యూడీలకు 4, ఇతరులకు 48 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ రమేష్‌, కౌన్సిలర్లు గణేష్‌, మణికంఠ, ఉమానాగరాజు,సరిత మల్లేష్‌గౌడ్‌, కొడె మహేష్‌, చాపరాజు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.



సీఎం కప్‌–23కు వీబీఐటీ విద్యార్థిని ఎంపిక



లీలా మాధురిని అభినందిస్తున్న చైర్మన్‌ గౌతంరావు, కార్యదర్శి మనోహర్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: అవుషాపూర్‌ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్‌ కళాశాల (వీబీఐటీ) వాలీబాల్‌ క్రీడాకారిణి లీలా మాధురి సీఎం కప్‌–2023 మేడ్చల్‌ జిల్లా వాలీబాల్‌ జట్టుకు ఎంపికై ంది. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం నిర్వహించిన అభినందన సభలో కళాశాల చైర్మన్‌ డాక్టర్‌ ఎన్‌ గౌతంరావు, కార్యదర్శి మనోహర్‌రెడ్డి ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామని, క్రీడల్లో విజేతగా నిలిచి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ నెల 28–31 వరకు సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో వాలీబాల్‌ పోటీలు జరగనున్నట్లు పీడీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ పీవీఎస్‌ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌ ప్రసాద్‌, పీడీ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌ పోటీల్లో సత్తా చాటిన మేడ్చల్‌ క్రీడాకారులు





సూర్యాపేటటౌన్‌ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో మూడు రోజులుగా కొనసాగుతున్న బాస్కెట్‌బాల్‌ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్‌ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి ములుగు, తృతీయ స్థానం వికారాబాద్‌ జిల్లా జట్లు దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్‌ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి వికారాబాద్‌, తృతీయ బహుమతి కామారెడ్డి జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి.

సైకిల్‌ హైరానా..



చెరువు వద్ద గాలిస్తున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్‌: చెరువు ఒడ్డున పడి ఉన్న ఓ సైకిల్‌ మేడ్చల్‌ పోలీసులు, ప్రజలను ఆందోళనకు గురి చేసింది. వివరాల్లోకి వెళితే శనివారం సాయంత్రం మేడ్చల్‌ పెద్ద చెరువు ఒడ్డున నీటిలో ఓ సైకిల్‌ను చూసిన స్థానికులు సైకిల్‌తో సహా చిన్నారులు చెరువులో పడి ఉండవచ్చని భావించి మేడ్చల్‌ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చెరువు వద్దకు చేరుకున్న ఎస్‌ఐ రఘురాం, సిబ్బంది సైకిల్‌ను బయటికి తీయించారు. పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో చిన్నారులు నీటిలో పడి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చేపట్టారు. అయితే అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి సదరు సైకిల్‌ తనదేనని సైకిల్‌ దొంగతనానికి గురైందని చెప్పాడు. చోరీ చేసిన వ్యక్తి సైకిల్‌ను చెరువు వద్ద పడేసి వెళ్లి ఉండవచ్చని భావించిన పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ విగ్రహావిష్కరణ



సర్దార్‌ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

కీసర: గీత కార్మిక కుటుంబంలో పుట్టి 16వ శతాబ్దంలో దొరలు, జాగిర్దార్లు, మొగలు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ విగ్రహాన్ని కరీంగూడ గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం రాత్రి కరీంగూడ గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేశం రవీందర్‌గౌడ్‌, దేశం అంజయ్యగౌడ్‌, దేశం మల్లేష్‌గౌడ్‌, సత్యనారాయణగౌడ్‌, దేశం వెంకటేష్‌గౌడ్‌, దేశం శ్రీకాంత్‌గౌడ్‌, , సర్పంచ్‌ గోపాల్‌రెడ్డి, పంజాలసరితా, గోక కళావతి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ హయాంలోనే రైల్వే వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం



మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్‌, చిత్రంలో హరివర్ధన్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: పట్టణంలో కొనసాగుతున్న రైల్వే వంతెన పనులకు కాంగ్రెస్‌ ప్రభుత్వమే శంకుస్థాపన చేసిందని, రాబోయే కాంగ్రెస్‌ ప్రభుత్వంలోనే వాటిని పూర్తి చేస్తామని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌, టీ పీసీసీ సీనియర్‌ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. రైల్వే వంతెన పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక అంబేడ్కర్‌ చౌరస్తాలో చేపట్టిన మహాదీక్షకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంతెన పనుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. నాడు ప్రజల ఇబ్బందులు పరిష్కరించేందుకు ప్రారంభించిన పనులను పదేళ్ల గడిచినా పూర్తి చేయలేదన్నారు. తెలంగాణలో అన్ని రంగాలను అభివృద్ధి చేశామని ముఖ్యమంత్రి, మంత్రులు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. పాఠశాలకు, డిగ్రీ కళాశాలకు తేడా తెలియని మంత్రి పాలనలో మనమున్నామని, ఆయన ప్రజాధనాన్ని దోచుకు తింటున్నాడని ఆరోపించారు. టీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారన్నారు. ఎంపీగా, మంత్రిగా నియోజకవర్గానికి ఎన్ని నిధులు వెచ్చించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. వంతెన బాధితుకు నష్టపరిహారం చెల్లించి పనులు పూర్తి చేయించాలని, లేని పక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ బీ బ్లాక్‌ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌, మండల అధ్యక్షుడు రాజేశ్‌, బోడుప్పల్‌ కార్పొరేటర్‌ అజయ్‌గౌడ్‌, వైస్‌ ఎంపీపీ జంగమ్మ, మహిళ కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి అనిత, కాంగ్రెస్‌ రాష్ట్ర మాజీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, నాయకులు ముత్యాలు యాదవ్‌, ఆంజనేయులు యాదవ్‌, సంజీవరెడ్డి, శివప్రదీప్‌రెడ్డి, నర్సింగ్‌రావు, భోజిరెడ్డి, గోవర్ధన్‌గౌడ్‌, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, కార్తీక్‌గౌడ్‌, అమర్‌ పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనుల పరిశీలన



ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీ యాదవ్‌

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చైర్‌ పర్సన్‌ పావనీ యాదవ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపుల, ఇళ్ల మధ్య చెత్త చెదారం, వ్యర్థాలను శుభ్రం చేయించారు. అనంతరం చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుంతల్లో నీరు నిలువకుండా పూడ్చివేయాలని, మార్కెట్లు, బస్సు ప్రయాణ ప్రాంగణాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ రవీందర్‌, జంగయ్యయాదవ్‌, విజయ్‌ముదిరాజ్‌, మున్సిపల్‌ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జేఏసీ నేతలు

కీసర: జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డును ఎత్తివేసేందుకు వివిధ కాలనీల ప్రజలతో కలిసి జేఏసీ చేస్తున్న పోరాటంలో భాగంగా నేషనల్‌ గ్రీన్‌ ట్రిబ్యునల్‌(ఎన్‌టీజీ) ఇచ్చిన ఆదేశాలను అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని జేఏసీ కన్వీనర్‌ డాక్టర్‌.బి.శంకర్‌నారాయణ్‌, కోకన్వీనర్‌ ఏనుగు సంజీవరెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా రూపొందించిన కరపత్రాలను దమ్మాయిగూడలోని వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుకాలనీలో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డును ఎత్తివేయాలని కోరుతూ నిరంతర పోరాటాలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జేఏసీ ఆధ్వర్యంలో నేషనల్‌ గ్రీన్‌ ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు చేయగా గత ఏప్రిల్‌ 10న ట్రిబ్యునల్‌ తమకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అయితే ఈ ఆదేశాలను అమలు చేయడంలో జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు ఇక్కడ చెత్తను తరలించాల్సి ఉందని, చెడు వాసన వస్తున్న నీటికి అడ్డుకట్టవేయాలని సూచించిందన్నారు. ఈ ఆదేశాలను అమలు చేసేందుకు జీహెచ్‌ఎంసీపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మొరుగు చంద్రమోహన్‌, రాము. తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం చేశారు



తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కిష్టాపూర్‌ వాసులు

మేడ్చల్‌: డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ పట్టణ పరిధిలోని కిష్టాపూర్‌ వాసులు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఎంపిక ప్రక్రియ కొనసాగించారన్నారు. అర్హులకు ఇళ్లు కేటాయించకుండా డ్రా పేరుతో అధికారులు, నాయకులు తప్పించుకోవడం దారుణమన్నారు. అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షుడు పరుశరాం, కిష్టాపూర్‌కు చెందిన నాగరాజు, భాస్కర్‌, నరెందర్‌,మైపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలి



వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీయాదవ్‌

ఘట్‌కేసర్‌: వీధి దీపాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని చైర్‌ పర్సన్‌ పావనీయాదవ్‌ మున్సిపల్‌ సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల ఈదురు గాలులకు స్థానిక బస్సు ప్రయాణ ప్రాంగణం, అంబేడ్కర్‌ చౌరస్తాలో పాడైపోయిన హైమాస్ట్‌ లైట్లకు శనివారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ మున్సిపాలిటీలో వీధీ దీపాలు వెలగకపోయినా, లోటల్టేజ్‌ సమస్యలపై మున్సిపల్‌ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్‌, సిరాజ్‌, విజయ్‌ముదిరాజ్‌, సిబ్బంది పాల్గొన్నారు.